# సాయం!

రచన:
భీమగాని చిన్నప్పరెడ్డి.

"ఓసీ! లక్ష్మి! త్వరగా చెంబుతో నీళ్ళియ్యావే. ఆకలవుతూ వుంది" అన్నాడు సత్యమయ్య ఇంటి యెదుట నిలచి.

"ఏమండీ! ప్రతిదినము ఈలాగుచేస్తే నేనెట్లు ఈ సంసారమీడ్వడం? బియ్యము, పప్పులోకి ఉప్పు తెస్తానని ప్రొద్దుపొడిచినప్పుడు వెళ్ళినవాళ్ళు మధ్యాహ్నమింటికి వస్తే ఏలాగు నే నీ పిల్లలను సముదాయించడం? సోము డింతటి వరకు అలిగియుండి యిప్పుడే పశువులు తోలుకొనివెళ్ళాడు. రాముడు బడికి వెళ్ళనని రోదనచేస్తున్నాడు. సుందరి ఏడుస్తూ దాని అవ్వయింటికి వెళ్ళిపోయింది. ఈ చంటి బిడ్డను సముదాయించడంలో తలప్రాణం తోకకు వచ్చింది, ఇంటిలో బియ్యములేదు, మిరపకాయలులేవు, ఉప్పులేదు. ఏపదార్థము ఇంటిలో లేనప్పుడు నే నేలాగు వండిపెట్టడం? నా యొద్ద అల్లాయుద్దీన్ లాంతరయినను లేదాయె......" అని నయాగర జలపాతమువలె మాటలను కుమ్మరిస్తూ వుంది లక్ష్మి, భర్తపైగల ఆయాసముతో.

"లక్ష్మి! మనకు మంచిరోజులు రానున్నాయి. అరుణోదయమునకు ముందుగా చిమ్మ చీకట్లు క్రమ్మునట్లు, మనకు రానున్న మంచిరోజులకు ముందుగా కష్టకాలము వస్తున్నది. అందుకు నీ వాయాసపడకూడదు. అనసూయ, దమయంతి, సావిత్రి యీలాంటి పతివ్రతల కథలను ప్రతి దినము చదువుతున్నావు గదా! కారణం తెలియకనే భర్తపైన ఆయాసపడటం పతివ్రత లక్షణమా? ఈ దినం నేనెందుకు ఆలస్యముగా వచ్చింది చెప్పెద విను. ఈరోజునుండి మనకష్టాలు పటాపంచలయిపోవునని నాకాశ కలిగింది. సిరిరానున్న యీసమయంలో నన్ను మోకాలడ్డుమంటావా? చెప్పు."

"నన్ను వేపుకతినక, ఆ ఎండమావుల వుపన్యాసమేమిటో ముగించండి."


ఏమీ లేదు. నేను వీథిలో ప్రొద్దునపోతూవుండగా..."

"ఊ పోతూవుండగా?"

"అయనే! మన కరణమయ్య........"

"ఆ కరణమయ్య కడుపుమండ! అతనిమాట మనకెందుకు? రాండి. గంజిచేశాను" అని లక్ష్మి మట్టిపాత్రలలో గంజిని భర్తకిచ్చింది. దాని నందుకొని,

"కరణమయ్య అంటె, ఎందుకు, లక్ష్మి నీకింతకోపం? అతని శక్తిసామర్థ్యాలు నీకేమి తెలుసు? అతడు మల్లిని ఎల్లి చేయగలడు. ఎల్లిని మల్లిచేయగలడు. పట్టుపట్టాడంటే బ్రహ్మకూకటిని ముట్టగలడు. చిత్రగుప్తుని కలములోనున్న శక్తి యితని కలములో వుంది అంటే నమ్ము. అటువంటివాడు మనపైన సానుభూతి చూపుతూ, మనకు సాయం చేస్తూవుంటే మన మతని తిరస్కరించవచ్చునా? నిందించవచ్చునా?



"గంజి చల్లారిపోతుంది త్రాగండి"

"అటువంటి కరణమయ్య యీనాడు నన్నింటికి రమ్మన్నాడు కాఫి యిచ్చాడు తాంబూళమిచ్చాడు. ఓ హెూ హెూ! ఎంత ఆదరణ చూపాడనుకొన్నావ్. మనబోటి పేదవాళ్ళను అంతటి పెద్దవాళ్ళు ఈవిథంగా ఆదరించడం ఈ ప్రపంచములో మరెచ్చటైనా జరిగిందేమో చెప్పు!"

"అదంతా డబ్బులాగేందుకు చేసే భోగముచేష్టలండీ! ఆ బంజరుభూమిని మనపేర పట్టాతెప్పిస్తానని ఏడాదప్పుడు మనయొద్ద వంద రూపాయలు లాగాడు. కాని పట్టారాలేదు

గిట్టా రాలేదు. వంద రూపాయిల అప్పునుమాత్రము మన నెత్తిన రుద్దాడు."

"లక్ష్మీ ఆవిషయములోమాత్రము కరణమయ్యను నిందించకు, వారిది చీమతలకాయంత తప్పు కూడ లేదు. వంద రూపాయిలు తీసుకొన్నాడే కాని, నా యెదుటనే పది వందల రూపాయిల పనిచేశాడు. ఆ పాడు యుద్ధమువచ్చినప్పుడు బంజరుభూము లెవ్వరికి పట్టాలివ్వకూడదని సర్కారువారు ఉత్తర్వులిచ్చారట. అందువలన కరణమయ్య ఎంత పట్టుదలతో వ్రాసినా, సర్కారువారు 'ససేమిరా' అన్నారట."

"ఆసంగతి తెలిసియుండి కరణమయ్య మనయొద్ద వంద రూపాయిలు ఎందుకు లాగాడు?"

"లాగితే మాత్ర మిప్పుడు మునిగిపోయిందేమే? సర్కారువారిప్పుడు ఆ వుత్తర్వును సడలించారు. మనబోటి బీదవాళ్ళకు పది ఎకరాల వంతున బంజరుభూమిని పట్టా యివ్వవలెనని ఉత్తర్వు పాలించారు. ఇంకేమి! మనరొట్టి విరిగి నేతిలో పడింది. ఆచెరువుదగ్గరవున్న పది ఎకరముల బంజరుభూమిని నాపేర పట్టా తెప్పిస్తానని కరణమయ్య యీరోజు నాచేతిలో చేయివేసి వాగ్దానంచేశాడు. ఆభూమి నాచేతికి వచ్చినతర్వాత ఒక్కొక్క ఎకరా యిరువది వందలు విలువచేస్తుంది. పది ఎకరాలకు ఇరువది వేలు. అప్పుడు నీపేరే సార్థకమవుతుంది లక్ష్మీ!"

"అయ్యో! రామ!! ఆలులేదు, సూలులేదు, బిడ్డపేరు సోమలింగడు అన్నట్టు గాలిలోని మేడలు మనకెందుకండీ! ఉన్నకష్టాలనుండి గట్టెక్కు తరుణోపాయమేదో అది చూడండి!"

"ఇదిగో! లక్ష్మీ! నీ వేదాంతముతో నాకు పనిలేదు. అరచేతిలోకి వచ్చిన యీపది ఎకరముల భూమి ఎట్లు జారిపోగలదు? ఆ దినాలలో ఆ రెవిన్యూ ఇన్స్పెక్టర్ ధర్మయ్యగారు ఆడినమాటమేరకు రెండెకరాల బంజరు భూమిని నాపేరున పట్టాచేయించలేదటే! ఇప్పుడు కూడ అంతే. ఈ పది ఎకరములభూమి మనదే."

"ఆ ధర్మయ్యగారు మీయొద్ద డబ్బుతీసుకొన్నాడా?"

"లేదు. కాని అందరు అలాగే వుంటారా? ఇప్పుడున్న రెవిన్యూ ఇన్స్పెక్టరుగారు పిల్లలుగలవాడట. డబ్బుతీసుకొనేవాడట. అతనికి రెండు వందల రూపాయిలిస్తే, యీపది ఎకరాలభూమి మనకే నన్నాడు కరణమయ్య."

"కాదండీ! మనకు స్వరాజ్యమువచ్చి రెండేళ్ళకు పైబడిందే; మనకు సురాజ్యమింకా ఎందుకు రాలేదండీ? స్వతంత్రరాజ్యములో లంచాలెందుకివ్వాలి? ప్రభుత్వమువారుచితంగా భూమి యిస్తూవుంటే, యీ ప్రభుత్వపునౌకర్లు లంచా లడగడం ఎందుకు?"

"ఇది లంచముకాదు. రెవిన్యూ ఇన్స్పెక్టర్‌గారికి పారితోషికమని కరణమయ్య చెప్పాడు."

"ఊఁ! వల్లకాదు! రెవిన్యూ ఇన్స్పెక్టరు పేరు చెప్పి కరణమే తింటాడేమో! రెండు వందల రూపాయిల నిప్పుడు ఎచ్చటనుండి తేవడం? ఏడాదప్పుడు కుబేరయ్యయొద్ద అప్పుగా తెచ్చిన వంద రూపాయిలకయిన వడ్డీ యిరువది రూపాయలే యివ్వలేకున్నాము. ఆ పది ఎకరముల భూమి నీట మునిగినా మనకు నష్టములేదు; కాని యింక అప్పు మాత్రము చేయవద్దు."

"కరణమయ్యకు మాట యిచ్చాను ఎల్లాగయినా ఇస్తానని"

"మాట! నీళ్ళమూట!! లంచము విషయములో మాట ఏమిటండీ?"

"లక్ష్మీ! నేనాడి బొంకను. ఆడిబొంకితే మనయింటికే కళంకమురాదా? ఆదినాలలో హరిశ్చంద్రుడు ఒక్కమాట కోసమేకదా రాజ్యాన్నివిడచి, ఆలుబిడ్డలను విక్రయించాడు. ఈనాటికి హరిశ్చంద్రుని పేరు ప్రతిష్ఠ లెలావున్నవో చూడు. నేను కరణమయ్యకు మాట యిచ్చాను. మన రెండు ఎకరముల భూమిని విక్రయించియైనా నా మాట నిలుపుకొంటాను."

సత్యమయ్య బిర, బిర కుబేరయ్య యింటికి వెళ్ళాడు. రెండు ఎకరాల భూమిని నాలుగు వందల రూపాయిలకు విక్రయించాడు. రెండు వందల రూపాయిలను కరణమయ్యకు అందజేసి, యింటికివచ్చాడు. పది ఎకరముల భూమి తనదేనని విశ్వసించాడు. పట్టావుత్తర్వులకై వేచియున్నాడు.

ఓనాడుదయం గ్రామతలారి తన యింటివైపునకు రావడం చూచి, అతృతతో వెళ్ళి.

"ఏమి, నాయనా! కరణమయ్యా పంపాడా?" అని అన్నాడు సత్యమయ్యా.

"ఔను" అన్నాడు తలారి.

"ఓసీ! లక్ష్మీ! ఇక్కడరావే. కరణమయ్యకు మన పైన ఎంత అభిమానమో చూడవే! మనయొద్దకే తన తలారిని పంపించాడే! ఆహా! ఎంత దయ. నమ్మితే పెద్దవారినే నమ్మాలి. ఇక మన కార్యమో పండన్నమాట! బీదవాళ్ళకు ఎంత సాయం! ఏమి, నాయనా! పట్టావుత్తర్వులు పంపాడా?"

"మీకు కబురంపాడు"

"ఏమి కబురు?" అంది లక్ష్మి.

"ఏమీ లేదమ్మా!......మీవూరి నారపయ్యా వారము రోజులక్రితం రెవిన్యూ ఇన్స్పెక్టరుయొద్దకు వెళ్ళి, ఆ పది ఎకరాల భూమిని తనకిస్తే, ఆరు వందల రూపాయి లిస్తానన్నాడట.

"కొంపతీసినా పది ఎకరాలు కాదు కదా?" అన్నాడు సత్యమయ్యా.

"అదేనయ్యా. నీవు మరి నాలుగు వందలు కరణమయ్యాగారికి అందజేయకపోతే రెవిన్యూఇన్స్పెక్టరు ఆ పది ఎకరాల భూమిని నారదయ్యకు ఇస్తాడని నీకు కరణమయ్యా కబురు పంపాడు" అన్నాడు తలారి.

సత్యమయ్యా ఒళ్ళంతా మండిపోయింది. అనేక పాములు, తేళ్ళు, జఋులు, మండ్రగబ్బలు ఒళ్ళంతా ప్రాకినట్టయింది. వేనకువేలు పిడుగులొక్కసారిగా అతనిగుండెలో పడినట్టయింది. పాపము! లక్ష్మి నిలువునా నీరయిపోయింది.

కరణమయ్యామాత్రము శ్రీరామ భజనమందిరములో "నమ్మినవారిని మోసముచేయుట, న్యాయము గాదురా, రఘునాధా!" అని భజనకీర్తన పాడుకొన్నాడు.

యువదంపతులకు వెలువడినది 50 గ్రంథముల శృంగార మార్గము త్వరపడుడు సారాంశము

# సతీపతికుతూహల రహస్యములు.

పూర్వకాలమున యువతీయువకులు కావ్యములను చదివి రసాస్వాదనము చేయుటయేగాక కామశాస్త్రమును తప్పక పఠించేవారు. రాణివాస మందలి కాంతలుకూడా దీనిని నేర్చెడివారని వాత్స్యాయనుడు వ్రాసియున్నాడు.

నేడీ కళాపరిచయము లేక యువతీయువకులు పశువర్తనమే ప్రధానముగ తలంచి వర్తించుచున్నారు. అది వారియపరాధము కాదు. తగిన గ్రంథము లేక పోవుటే దీనికి ప్రధానకారణము. నేడీ కొరతతీరినది. సతీపతి కుతూహల రహస్యములను నీ గ్రంథము విపులముగ పూర్వాధునిక కామకళా గ్రంథములతో నిండి కళాసంబంధమగు పూర్ణ జ్ఞానమును కలిగించుచున్నది. ముద్దులొలుకు చిత్రపటములతో నిండినది. గ్రంథము వెల రూ. 2—8—0. పోస్టేజి 7 అణాలు.

ఆర్యన్ బుక్ డిపో,
సౌకార్‌పేట, మద్రాసు.

# వ్యాపారాభివృద్ధికి!

ఇరువది సంవత్సరముల నుండియు ఆంధ్రదేశమున సర్వతోముఖముగ ప్రచారముగలిగి దేశసేవయందును, భాషాసేవయందును అగ్రస్థానము వహించిన చిత్రగుప్తయందు ప్రకటనచేసి మీ వ్యాపారాన్ని వృద్ధిపొందించుకొనుడు. పత్రపత్రికలకెల్ల చిత్రగుప్తదే అగ్రస్థానము.

| | | |
|---|---|---|
| పూర్తిపేజి | ... | రు. 75—0—0 |
| అర్థపుట | ... | 40—0—0 |
| పావుపుట | ... | 25—0—0 |

కాంట్రాక్టు ప్రకటనలకు ప్రత్యేకపు చార్జి.

ప్రచురణకర్తలకు:

పుస్తకములు, ఇతర చిల్లరపనులు సకాలమునకు — అందముగ ముద్రించి యీయబడును. —

వివరములకు:— మేనేజరు,
చిత్రగుప్త.

6, లాయర్ చిన్నతంబి మొదలివీధి, మద్రాసు.